# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని జీ7 శిఖరాగ్ర సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోది పిలుపునిచ్చారు.**
2. **ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని త్వరలోనే అమలు చేస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.**
4. **తెలంగాణ రాష్ట్ర పండుగగా బోనాల పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి కొండా సురేఖ తెలిపారు.**
5. **దేశవ్యాప్తంగా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష ఈరోజు జరుగుతుంది.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటలీ పర్యటన ముగించుకుని నిన్న ఢిల్లీకి చేరుకున్నారు. ఇటలీ పర్యటన విజయవంతమైందని, వివిధ అంశాలపై ప్రపంచ నేతలతో చర్చలు జరిపినట్లు సామాజికమాధ్యమం ద్వారా నరేంద్రమోదీ తెలిపారు. అంతర్జాతీయ సమాజానికి ప్రయోజనం చేకూర్చే ప్రభావవంతమైన పరిష్కారాలను కనుగొనేందుకు భవిష్యత్ తరాలకు మెరుగైన ప్రపంచాన్ని రూపొందించడానికి జీ-7 కూటమి కట్టుబడి ఉంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యంగా ఆఫ్రికా ఖండంలో సమస్యలపై దృష్టి సారించాలని ప్రధానమంత్రి నరేంద్రమోది జీ7 శిఖరాగ్ర సమావేశంలో పిలుపునిచ్చారు.

--------------------------

ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్-6, ప్రజాగళం హామీలను అమలు చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. నిన్న ఆయన ఉండవల్లిలోని నివాసం నుంచి మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ సభ్యులు, టిడిపి కార్యకర్తలతో దృశ్యమాధ్యమ విధానంలో మాట్లాడారు. ప్రజాప్రతినిధులు బాధ్యతగా, పనిచేస్తేనే ప్రజలు ఆదరిస్తారని అన్నారు. నైపుణ్య గణనతో యువత జీవన ప్రమాణాలు మార్చడానికి ఎంతో అవకాశం ఉంటుందని చెప్పారు. వారిలో ఏ మేరకు నైపుణ్యం ఉందో గణించి.. ఆ మేరకు అవకాశాలు

కల్పిస్తామన్నారు. 2014-19 మధ్య కాలంలో ఎక్కడెక్కడ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామో వాటన్నింటిని 100 రోజుల్లోనే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని త్వరలోనే అమలు చేస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. రవాణాశాఖ మంత్రిగా నియమితులైన తర్వాత తొలిసారిగా నిన్న కడపకు వెళ్ళిన మంత్రికి టిడిపి నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకలో ఇప్పటికే ఉచిత ప్రయాణం అమలవుతున్నందున.. మరింత విస్తృతంగా అధ్యయనం చేసి పొరపాట్లకు తావు లేకుండా రాష్ట్రంలో ఉచిత ప్రయాణాన్ని ప్రవేశపెడతామని తెలిపారు.

-------------------------

తెలంగాణ రాష్ట్ర పండుగగా బోనాల పండగను ఘనంగా నిర్వహించేందు ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి కొండా సురేఖ తెలిపారు. జులై నెలలో జరగనున్న బోనాల పండుగ ఏర్పాట్లపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ బోనాల పండుగ ఏర్పాట్లపై అన్ని శాఖల సమన్వయంతో ముందుకు వెళ్తామని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయాల వద్ద అన్ని రకాల ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేలా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. త్వరలోనే బోనాల తేదీలను, పూర్తి సమాచారంతో కాలెండర్ ను విడుదల చేస్తామని మంత్రి వివరించారు.

-------------------------

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ -యూపీఎస్సీ నేతృత్వంలో సివిల్ సర్వీసెస్, ఫారెస్ట్ సర్వీసెస్‌కు నిర్వహించనున్న సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష-2024 ఈ రోజు జరగనుంది. రెండు విడతలుగా ఈ పరిక్ష జరుగుతుంది. ఈ రోజు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి ఉదయం 11 గంటల 30 నిమిషాల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 4 గంటల 30 నిమిషాల వరకు పేపర్-2 పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయానికి 30 నిమిషాల ముందువరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతిస్తారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని అధికారులు తెలిపారు.

దేశవ్యాప్తంగా 80 నగరాల్లో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు యూపీఎస్సీ ఏర్పాట్లు చేసింది.రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సివిల్స్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం హైదరాబాద్, విశాఖపట్నం,విజయవాడ, వరంగల్, తిరుపతి, అనంతపురం నగరాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

-------------------------

నేర న్యాయ వ్యవస్థపై భారత్ ప్రగతిపథం పేరుతో కేంద్ర ప్రభుత్వం ఈరోజు కోల్‌కతాలో సదస్సును నిర్వహిస్తున్నట్టు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ తెలిపింది. జులై 1వ తేదీ నుంచి అమలులోకి రానున్న భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ సాక్ష్యా అధినియమ్‌లకు సంబంధించి ఈ సదస్సు జరుగుతుందని పేర్కొంది. ఈ సదస్సులో నూతన నేర చట్టాలపై సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు న్యాయశాఖాధికారులు తెలిపారు. ఈ చట్టాల గురించి ప్రజలలో అవగాహన పెంచేందుకు ఇప్పటికే ఢిల్లీ, గౌహతిలలో న్యాయశాఖ రెండు సదస్సులు నిర్వహించిందని మంత్రిత్వ శాఖ తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌ను పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. కర్నూలులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, గత ప్రభుత్వం పారిశ్రామికవేత్తలతో కుదుర్చుకున్న ఒప్పందాలను  పూర్తి స్థాయిలో సమీక్షిస్తామన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. పరిశ్రమల అనుమతుల విషయంలో ఏకగవాక్ష వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేస్తామని తెలుపుతూ,

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

ఆహారభద్రత ప్రమాణాలు పాటించని వారిపై  కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. నిన్న హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ఆహారభద్రతపై అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణలోని బేకరీలు, రెస్టారెంట్లు వంటి వాటిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, మొబైల్ ఫుడ్‌ల్యాబ్ ద్వారా రోజుకు 200 వరకు నమూనాలను  పరిశీలించాలని అధికారులకు సూచించారు. నాణ్యమైన ఆహార పదార్థాల తయారీపై అవగాహన సదస్సులు ఏర్పాటుచేయాలని,  ప్రతి శనివారం ఫుడ్‌ల్యాబ్స్ ద్వారా చేసిన పరీక్ష ఫలితాల నివేదికలు అందజేయాలని తెలిపారు.

---------------------------

తెలంగాణలో మహిళలు ఆర్థిక సాధికారత సాధించేలా చేయడమే ప్రభుత్వ  లక్ష్యమని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. నిన్న హైదరాబాద్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థకు సంబంధించిన ఎస్ హెచ్ జీ బ్యాంకు లింకేజీ 2024-25 సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళిక విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క  మాట్లాడుతూ, మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా 20 వేల కోట్ల రూపాయలు  వడ్డీలేని రుణాలను ఇస్తున్నామని తెలిపారు.  పొదుపు అనేది భద్రత, బాధ్యత అని, స్థానిక ప్రాంతాల్లో   ఉండే.. అవసరాలకు అనుగుణంగా మహిళలు వ్యాపారం చేయాలని తెలిపారు. బ్యాంకులు, ప్రభుత్వం రెండిటి సహకారంతోనే పేదరిక నిర్మూలన జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌సీతోపాటు ఎంబీఏ తదితర కోర్సుల్లో చేరేందుకు నిర్వహిస్తున్న సీపీగెట్ పరీక్షకు ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు చేసుకునే గడువు రేపటితో ముగియనుందని కన్వీనర్ పాండురంగారెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 52 వేల మంది దరఖాస్తు చేశారన్నారు. రసాయన, జంతు, వాణిజ్యశాస్త్రాలకు ఒక్కో విభాగానికి నాలుగు వేలకుపైగా దరఖాస్తులు అందాయన్నారు. అభ్యర్థులు ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

---------------------------

ఖరీఫ్ సీజన్ దృష్ట్యా విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా రైతులకు అందుబాటులో ఉంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలో నిన్న  వ్యవసాయ శాఖ

ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈనెల 18న రైతులకు అందించే పీఎం కిసాన్ నిధుల విడుదలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రైతులకు ప్రతి అధికారి అందుబాటులో ఉండాలని సూచించారు.

---------------------------

పీఎం- కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 2 వేల రూపాయలను ఈనెల 18వ తేదీన నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. నిన్న ఆయన ఢిల్లీలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... వారణాసిలో జరగబోయే కిసాన్ సమ్మేళన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొని 17వ విడత పీఎం-కిసాన్ పథకం నిధులను విడుదల చేస్తారని వెల్లడించారు.

=======================